క్లుప్తంగా

వినాయక చవితిని ఘనంగా జరుపుకోవాలి

నెల్లూరు(బృందావనం): వినాయక చవితిని ప్రజలు ఘనంగా జరుపుకోవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భగవంతుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని కాంక్షించారు.

కార్పొరేషన్లో నేటి 'స్పందన' రద్దు

నెల్లూరు సిటీ: నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని వినాయక చవితి కారణంగా రద్దు చేశారు. ఈ మేరకు కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

డ్రైవర్స్ కాలనీలో వైద్య శిబిరం



నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని డ్రైవర్స్ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని వరపరివార్ సేవా ఫౌండేషన్, మాదాల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ వెంకటతరుణ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. హాజరైన వారికి వివిధ వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. మాధవి, నసీరుద్దీన్, జుబేర్, సర్దార్, వంశీ, సుజాత, దగ్గుబాటి రాధాకృష్ణ, పవన్, మల్లికార్జున పాల్గొన్నారు.

చీరల పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని సుబేదారుపేటలో పేదలకు దుప్పట్లు, చీరలను ఏపీకే ఫౌండేషన్, అరిగెపూడి విజయ్‌కుమార్ సౌజన్యంతో ఆదివారం పంపిణీ చేశారు. నిర్వాహకుడు కేతా సుబ్బారావు పాల్గొన్నారు.

సోమిరెడ్డి రాజకీయం అవినీతిమయం



మాట్లాడుతున్న వెంకటశేషయ్య

వెంకటాచలం : సోమిరెడ్డి రాజకీయ జీవితం అవినీతిమయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య అన్నారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని అడ్డంపెట్టుకుని సోమిరెడ్డి విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, సోమిరెడ్డి అవినీతి గురించి ప్రజలకు బాగా తెలియడంతో ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిస్తున్నారని తెలియజేశారు. నీరు–చెట్టు, రైతు రథం పథకాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవడం వాస్తవం కాదానని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేస్తున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక సోమిరెడ్డి నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నక్కలకాలువ పనులు ప్రారంభించడంతో ఓర్వలేకపోతున్నారని చెప్పారు. వైస్ ఎంపీపీ పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, చీకుర్తి నరసయ్య, వెంకటరమణయ్య, మందా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గౌడ సంఘ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు



పొదలకూరు : జిల్లా గౌడ సంఘ ఉపాధ్యక్షుడిగా పొదలకూరు మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన వెంపులూరు శ్రీనివాసులుగౌడ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్ వెల్లడించారు. జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నికలో భాగంగా శ్రీనివాసులుగౌడ్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందించి సన్మానించారు.

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలి

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: చెత్త రహిత నగరంగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. స్వచ్ఛతే లక్ష్యంగా నగరంలోని బారాషహీద్ దర్గాలో వాటర్ ఫ్రంట్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్వర్ణాల చెరువు, బారాషహీద్ దర్గా ప్రాంగణంలో వ్యర్థాలను తొలగించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. స్వచ్ఛత లీగ్‌లో ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు. స్వచ్ఛత లీగ్ అంబాసిడర్, అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ తులసి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్ వికాస్ మర్మత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. క్రేన్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు.



చెత్తను తొలగిస్తున్న వికాస్ మర్మత్

గృహాలను నాణ్యతగా నిర్మించాలి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్న కాలనీల్లో ఇళ్లను నాణ్యతగా నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన నివాసంలో గృహ నిర్మాణ శాఖ డీఈ, ఏఈలతో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలో గృహ నిర్మాణాల విషయంలో అధికారులు అలసత్వం వహించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డిసెంబర్ నాటికి ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. గృహాల కోసం ఎవరైనా అర్జీలను అందజేస్తే, సదరు అర్జీ ఏ దశలో ఉందో సంబంధిత లబ్ధిదారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వారికి అన్ని సదుపాయాలను కల్పించాలని, కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో పాటు ఇతర అధికారులను సమన్వయం చేసుకొని లేఅవుట్లలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీహరిగోపాల్, ఏఈలు శరత్‌చంద్ర, రవి, వివేక్, కరిముల్లా, ప్రకాష్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

విద్యుత్ శాఖ అనుమతులు తప్పనిసరి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినాయక చవితి ఉత్సవాల కోసం ఏర్పాటు చేస్తున్న గణేశ్ మండపాల్లో విద్యుత్ అలంకరణ కోసం తాత్కాలిక అనుమతిని నిర్వాహకులు పొందాలని విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే 250కుపైగా మండపాలకు పోలీస్ శాఖ అనుమతిని పొందారని చెప్పారు. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పది రోజుల పాటు తాత్కాలిక విద్యుత్ అనుమతి కోసం మీ సేవ కేంద్రాలు, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినం

నెల్లూరు(మినీబైపాస్): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పప్పులవీధిలో భారతీయ జనతా మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేట నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీని జరిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర నేతలు కర్నాటి ఆంజనేయరెడ్డి, శ్రీనివాసులు, మునిరత్నం నాయుడు, నరసింహులునాయుడు, జయచంద్ర, పోకూరి వెంకటేశ్వర్లు, రామయ్య, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను కొండాయపాళెం గేట్ సెంటర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రాజేష్, శ్రీను, విజయకుమార్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

• నగరంలోని కుక్కలగుంటలో అన్నదానాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాని మోదీ చేపట్టిన విశ్వకర్మ కౌశల్ యోజన ప్రారంభ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు.



ఏపీఆర్ఎస్ఏ కార్యవర్గ సమావేశం

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలోని అసోసియేషన్ జిల్లా భవనంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి అధ్యక్షత వహించారు. విజయవాడలో వచ్చే నెల ఒకటిన నిర్వహించనున్న రాష్ట్ర రెవెన్యూ కౌన్సిల్ సమావేశానికి డిప్యూటీ కలెక్టర్ నుంచి ఆఫీస్ సబార్డినేట్లు, జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. పదోన్నతులు కల్పించిన కలెక్టర్, జేసీ, జిల్లా రెవెన్యూ అధికారికి కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం వివిధ అంశాలపై తీర్మానం చేశారు. జిల్లా కార్యదర్శి డానియెల్ పీటర్‌రావు, అసోసియేషన్ ప్రెసిడెంట్, కోశాధికారి సతీష్, శేషయ్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెంచలరెడ్డి

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. గోమతినగర్‌లోని కోటి ఇంద్రావతి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ గోపాల్‌రెడ్డి, జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ హాజరయ్యారు. అసోసియేషన్ నేతలు సుబ్బారావు, శేషారెడ్డి, హుస్సేన్‌ఖాన్, సన్యాసిరావు, వీరయ్యచౌదరి, నాగరాజు, సాయిసుధాకర్, ప్రసాద్, చంద్రశేఖరం, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయశర్మ సేవలు చిరస్మరణీయం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజ మాజీ కార్యదర్శి ఆంజనేయశర్మ సంతాప సభను ఆదివారం నిర్వహించారు. రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రమణయ్య, నారాయణ, గిరిజాలక్ష్మి, మల్లెల శ్రీహరి, శ్రీనివాసులు, రమణయ్య, సుబ్రహ్మణ్యంయాదవ్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెంచలయ్య

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ భగవాన్ జయంతి

నెల్లూరు(బృందావనం): విరాట్ నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో విశ్వకర్మ భగవాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో పంచవృత్తుల పతాకాన్ని నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం అభిషేకాలు, పూజలు చేశారు. 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

• ములుమూడి బస్టాండ్ సెంటర్ సమీపంలోని హరిహరనాథస్వామి దేవస్థానంలో విశ్వకర్మ జయంతిని నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు గుమ్మడిపూడి కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేశారు. సంఘ నిర్వాహకులు గణేష్ ఆచారి, జయచంద్ర, గోవిందరాజులు, జయశంకర్, వీరబ్రహ్మయ్య, లక్ష్మీప్రసాద్, శ్రీనివాస్, దివ్య, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..



హరిహరనాథస్వామి దేవస్థానంలో..



విశ్వబ్రాహ్మణ సంఘు ఆధ్వర్యంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విశ్వకర్మ జయంతిని నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలను సంఘ జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆధ్వర్యంలో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేతివృత్తుల వారి సంక్షేమానికి పీఎం విశ్వకర్మ యోజనను ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టడంపై ఆనందం వ్యక్తం చేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



కళాసంఘాల కార్యాలయంలో..

నెల్లూరు(బృందావనం): మట్టి గణపతి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వినాయక చవితి నిపురస్కరించుకొని గాంధీబొమ్మ సమీపంలోని కళాసంఘాల చాంబర్‌లో మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు. కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, భాస్కర్, డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జకీర్, సీనియర్ డ్యాన్స్ మాస్టర్లు నటరాజు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..

• స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మట్టి వినాయక ప్రతిమలను నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం, చెంచు మహాలక్ష్మి క్యాటరింగ్ సౌజన్యంతో చేపట్టిన కార్యక్రమంలో పేర్ల సీతారామారావు, శ్రీరామ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

• మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో 1500 మట్టి వినాయక ప్రతిమలను ఏఎమ్మార్, ఎస్సెస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

తపాలా ఉద్యోగుల డివిజన్ సెక్రటరీగా మహేష్



నెల్లూరు(మినీబైపాస్): గ్రామీణ తపాలా ఉద్యోగుల నెల్లూరు డివిజన్ కార్యదర్శిగా గుండ్రా మహేష్, ప్రెసిడెంట్‌గా పెంచలయ్య ఎన్నికయ్యారు. ఆలిండియా జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, గ్రూప్ – సీ సెక్రటరీ వెంకయ్య, సభ్యుల ఆమోదంతో వీరిని ఎంపిక చేశారు.

యూపీహెచ్‌సీలో పరిశీలన



నెల్లూరు(సెంట్రల్): వేదాయపాళెంలోని యూపీహెచ్‌సీని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ ఆదివారం పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు ఇచ్చిన యాప్‌పై పలు సూచనలు చేశారు.

గొలగమూడికి సాయి భక్తుల పాదయాత్ర

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి గొలగమూడికి పాదయాత్రను భక్తులు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా మందిర చైర్మన్ మధుసాయి మాట్లాడారు. సాయిమాల ధారణ మండల దీక్ష, షిర్డీ యాత్రను చేపట్టనున్న సందర్భంగా 300 మందికిపైగా భక్తులు గొలగమూడికి పాదయాత్రను చేపట్టారని వివరించారు. అనంతరం మహాప్రదక్షిణ ద్వారా వెంకయ్యస్వామిని దర్శించుకొని.. పట్టు వస్త్రాలు, పూలమాలలను సమర్పించారు. వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, వేమూరి కిశోర్, శ్రీధర్, నాగార్జుననాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణికి సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో డీసీసీబీ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్ ఆధ్వర్యంలో యూనియన్ నేతలు ఆదివారం సత్కరించారు. వినాయక చవితి శుభాకాంక్షలను తెలియజేసి వినాయక ప్రతిమను అందజేశారు. అనంతరం డీసీసీబీ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. బాబు, గౌస్‌బాషా, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.